తెలుగు సినిమాలోలా ఆ అమ్మాయి లోపలికి గెంటబడింది. తలుపులు మూసేశారు బయట గడియెట్టేశారు. ఆత్మారాం తెలుగు సినిమాలో లాగే ఆ అమ్మాయి దగ్గరికి నడిచి వెళ్ళాడు. (చేతిలో కళ్ళజోడు పెట్టెతో)

ఆ అమ్మాయి ఆత్మారాం పాదాలమీద వాలిపోయి భారీ డైలాగు చెప్పింది ఒకటి.

"నమ్మకద్రోహం చేశాను మీకు. మీరు నన్ను క్షమించానంటే కాని మీ పాదాలు వదలను"

వంగి మృదువుగా ఆ అమ్మాయిని లేవనెత్తుకున్నాడు ఆత్మారాం. "ఫర్వాలేదు నేను కూడా."

తలెత్తిన ఆ అమ్మాయి మొహానికున్న కళ్ళజోడుని చూడగానే ఆత్మారాంగుండె ఘల్లుమంది.

# పువ్వులు

"అబ్బబ్బబ్బ చస్తున్నాను ఈ మనిషితో వేగలేక. ఏళ్లొస్తున్నాయి ఎందుకు?"

తెల్లబోయి చూసాడు కుచేలరావు భార్యవంక అప్పుడే ఆఫీసు నుంచి తిరిగివచ్చాడు కుచేలరావు. భార్యకి పూలపొట్లం అందించాడు సంతోషపడుతుందనుకున్నాడు. ఎప్పుడయినా పూలుతెస్తే కుచేలరావు భార్య సంతోషపడిపోతుంది. పూలంటే ప్రాణం కాబట్టి.

కుచేలరావు వూహించని విధంగా ఆ పూలపొట్లాన్ని ఓమూల విసిరేసి పై మాటలు అన్నది కుచేలరావు భార్య విసురుగా.

"నీకిష్టమని తెచ్చాను, తప్పేమిటి?" అహం దెబ్బతినగా అన్నాడు కుచేలరావు ఎర్రబడ్డ మొహంతో. ఆఫీసులో చండశాసనుడైన

ఆఫీసర్‌తో వేగలేక సతమతమై వచ్చిన కుచేలరావులో ఓర్పు ఎంతమాత్రం లేదు.

"తేకపోతే ఏమిటి? నా కిప్పుడు మీ సంపాదనలో పూలేం తక్కువయ్యాయి? పెద్దదాని జాకెట్ కుట్టడానికి ఇచ్చి వారం దాటింది అది తెమ్మని మొత్తుకుంటోంది అది."

"నా దగ్గర రెండున్నర ఎక్కడుంది? రేపు జీతం వచ్చాక తెస్తానన్నానుగా!"

"నా శ్రాద్ధం తెస్తారు."

కుచేలరావుకి ముక్కుమీదుంటుంది కోపం. మనసుకి గాయం కలిగేలా ఎవరయినా మాటాడితే విపరీతమయిన కోపం వస్తుంది. వస్తే వారమయినా తగ్గదది. ఎవరితో మాట్లాడకుండా మౌనంగా వుంటాడు. భోజనం చేయడు, ఒకోసారి రెండు మూడు పూటలదాకా.

కుచేలరావు పడక కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు. అరగంటతర్వాత కుచేలరావు భార్య అన్నది గుమ్మంలో నిలబడి.

"వడ్డించాను_ భోజనానికి రావచ్చు."

ఆ మాటలు వినబడనట్లుగా కదలలేదు కుచేలరావు.

"మిమ్మల్నే నాకన్నిసార్లు చెప్పే ఓపికలేదండి. అన్నం వడ్డించాను రండి" మళ్ళీ చెప్పింది కుచేలరావు భార్య.

"నాకాకలిగా లేదు. తినను" చెప్పాడు కుచేలరావు వీలయినంత ప్రశాంతంగా.

"ఎందుకాకలిగా వుండదూ?"

"లేదంతే."

"నా మీద కోపం వస్తే అన్నం ఏం చేసింది?"

కుచేలరావు పెదవి కదపలేదు.

"మీ యిష్టం"

"నీకు తెలుసు నా సంపాదన మన కుటుంబానికే చాలదని. ఆ సంగతి పదేపదే గుర్తుచేసి నా మనసు బాధ పెట్టడం నీకు సరదా అయితే అలాగే కానివ్వు" అన్నాడు కుచేలరావు.

మర్నాడు జీతం అందుకోగానే, టైలర్ దగ్గరనుంచి ఆ జాకెట్ తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు కుచేలరావు. ఆ రాత్రి పస్తుపడు కున్నాడు కుచేలరావు. తను తినకపోతే తన భార్య కూడా తినదన్నసంగతి తెలిసికూడా.

మర్నాడు జీతం తీసుకుని, ఆ జాకెట్ తీసుకొని, ఇంటికి కావల్సిన సరుకులన్నీ కొనుక్కొని వచ్చాడు కుచేలరావు.

"నాకు అన్నం వండకు. అట్టే ఆకలిలేదు" చెప్పాడు భార్యతో సాయంత్రం.

కుచేలరావు భార్య ఆయనకికూడా వండింది అన్నం. రాత్రి ఎనిమి దింటికి పిలిచింది కంచంలో వడ్డించి.

"రానన్నానా! ఎందుకు వడ్డించావు?" ఎగిరిపడ్డాడు కుచేలరావు భార్య మీద.

భర్త పక్కకి స్టూల్ లాక్కొని కూర్చుని లాలనగా చెప్పింది కుచేలరావు భార్య

"నిన్న కావాలనే అలా అరిచాను మీ మీద. నాకు మీ మీద పూలు తెస్తే ఎప్పుడయినా కోపం వచ్చిందా చెప్పండి? రండి తిందాం"

"నాకు అవసరంలేదు" ఒక్కొక్క అక్షరం కోపంగా వత్తిపలికాడు కుచేలరావు.

భర్త గడ్డంకింద చేయి వేసి అన్నది కుచేలరావు భార్య.

"నిజం! నిన్న మీకు నామీద కోపం రావాలనే ఉద్దేశ్యంతో అలా అరిచాను అంతే. నాకు కోపం వచ్చికాదు."

కుచేలరావు మాట్లాడలేదు.

"నిన్న బియ్యం అయిపోయాయి. కిరసనాయిలు కూడా లేదు. రాత్రి అన్నం వండలేకపోయాను ఆ సంగతి చెపితే మీరు బాధపడారని, కంటతడి పెడతారని తెలిసి, మీ చేత అన్నం తినను అనపించాలని అలా అరిచానంతే।"

కుచేలరావు భార్య మొహంలోకి చూశాడు ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా_

"అవును రాత్రి పూలు గిన్నెలో వేసి నీళ్లు చల్లి మూత పెట్టాను చూడండి వాడిపోకుండా ఎలా వున్నాయో? ఇప్పుడే కోసిన వాటిలాగా" తలలోని పూలచెండుని చూపించింది కుచేలరావు భార్య.

ఆయన కళ్లు చెమర్చాయి. వంగి భార్య నుదుటిమీద సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు.

# పెట్టుడు చీర

కల్పకం ఒక్కతే చెల్లెలు నరహరికి.

ప్రతిఏడు దీపావళి పండుగకి పిలిచి, కల్పకానికి ఒక చీర, జాకెట్టు, పండు, తాంబూలం పెట్టడం గత అయిదేళ్లుగా నరహరికి అనవాయితీగా వస్తోంది.

కల్పకం, నరహరుల తండ్రిపోయి అయిదేళ్ళయింది. తన తండ్రి స్వర్గస్థుడయినప్పటినుంచీ, ఆయన బాధ్యత తనమీద వేసుకుని తన శక్తి వున్నంతలో చీర, జాకెట్టు పెడుతున్నాడు నరహరి చెల్లెలికి.

ఆడపిల్ల కాబట్టి, అన్నయ్యనుంచి ఖరీదయిన చీర ఆశించడంలో కల్పకం తప్పులేదు. నరహరి పెద్ద వుద్యోగస్తుడు. చన్నీళ్ళకు వేణ్నీళ్ళు తోడన్నట్లుగా నరహరి భార్యకూడా ఉద్యోగం చేసి నాలుగొందలదాకా సంపాదిస్తోంది.